చివరి రోజు.. కిక్కు
- మద్యం దరఖాస్తులకు ముగిసిన గడువు
- ఫీజు చెల్లించిన వారి నుంచి రాత్రి వరకు స్వీకరణ
- గుంటూరు జిల్లాలో అత్యధికంగా దరఖాస్తుల దాఖలు
- వ్యాపారుల సిండికేట్‌తో బాపట్ల జిల్లాలో తగ్గిన వైనం



రాష్ట్రంలో 1450 బస్సులు కొనుగోలు
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


బస్సును ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

ఐసీఐసీఐ బ్యాంకులో కొనసాగిన సీఐడీ విచారణ

2లో..




మహిషాసురమర్దినీ..
జయ జయహే

దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జయజయహే మహిషాసురమర్దిని కీర్తనలతో ఆలయ పరిసరాలు హోరెత్తగా భక్తులు పులకించిపోయారు. శనివారం దసరా పర్వదినం సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

- బాపట్ల


బాపట్ల: శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీమహిషాసురమర్దినిగా అమ్మవారు


బాపట్ల: చందోలులో శ్రీ మహిషాసురమర్దిని అలంకరణలో శ్రీబగళాముఖి అమ్మవారు


బాపట్ల పాతబస్టాండ్‌లో శ్రీ లక్ష్మీపద్మావతి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ మహిషాసురమర్దిని దేవిగా అమ్మవారు


చుండూరు: వలివేరులో మహిషాసురమర్దిని అలంకారం


రేపల్లె: బూరుగులమ్మ దేవాలయంలో మహిషాసురమర్దినిగా అమ్మవారు





ఆంధ్రజ్యోతి బాపట్ల జిల్లా వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

దసరా శుభాకాంక్షలు తెలియజేసిన ప్రముఖులు

బాపట్ల, అక్టోబరు 11 : జిల్లా ప్రజలకు అధికారులు, నాయకులు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విజయదశమి అందరి జీవితాలలో విజయాలు చేకూర్చాలని వారు ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఆర్డీవో గ్లోరియా, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి

● భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్న మంత్రులు

రేపల్లె, అక్టోబరు 11 : దసరా మహోత్సవాల సందర్భంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామిని రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, అభివృద్ధిలో ఆటంకాలు లేకుండా చూడాలని వేడుకున్నానని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామికి మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా మహోత్సవాల సందర్భంగా భ్రమరాంబదేవి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలని కోరుకున్నానన్నారు. అనంతరం అలయ వేద పండితులు సత్యప్రసాద్, రవిలకు వేద ఆశీర్వచనం చేసి ఆలయ జ్ఞాపికను అందజేశారు.



మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికి జ్ఞాపికను అందజేస్తున్న చిత్రం

దుర్గాదేవి అనుగ్రహంతో పాడిపంటలతో కళకళలాడాలి

● మంత్రి అనగాని

రేపల్లె, అక్టోబరు 11 : రాష్ట్ర ప్రజలకు రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు, నియోజకవర్గంలోని ప్రజలందరికి విజయదశమి సందర్భంగా దుర్గాదేవి అనుగ్రహంతో ప్రజలు పాడిపంటలతో సిరిసంపదలతో తులతూగాలని, దుర్గాదేవి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.రాష్ట్రాభివృద్ధి కోసం ఎన్డీయే ప్రభుత్వం ఎనలేని కృషిచేస్తుందన్నారు.బాధ్యతలు చేపట్టి 100 రోజులు దాటిన లోపే ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అండగా నిలుస్తుందన్నారు. యావత్ రాష్ట్రం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కృషిచేస్తున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం రూ. 4,500 కోట్లతో రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు.

జిల్లా వ్యాప్తంగా పటిష్ఠ బందోబస్తు

● ఎస్పీ తుషార్‌డూడి



బాపట్ల, అక్టోబరు 11 : దసరా వేడుకల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఈ విషయమై శుక్రవారం ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాలు జరిగే దేవాలయాలు, నవరాత్రి ఉత్సవాలు జరిగే అమ్మవారి ఆలయాలు, ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ఠ చర్యలు తీసుకొని ఆ ప్రదేశాలపై నిఘా ఉంచి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా ప్రజలంతా విజయదశమి వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. విజయాలకు చిహ్నమైన ఈ విజయదశమి అన్నిరంగాలలోని వారికి విజయం చేకూర్చాలని ఎస్పీ ఆకాంక్షించారు.

12 మద్యం షాపులకు 195 దరఖాస్తులు

● ఎక్సైజ్ సీఐ రవి



వేమూరు, అక్టోబరు 11 : వేమూరు నియోజకవర్గంలోని ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 12 మద్యం షాపుల ఏర్పాటుకు 195 దరఖాస్తులు అందినట్లు సిఐ రవి శుక్రవారం రాత్రి తెలిపారు. వేమూరు మండలంలో 63 దరఖాస్తులు, అమృతలూరు మండలంలో 35 దరఖాస్తులు, చుండూరు మండలంలో 43 దరఖాస్తులు, కొల్లూరు మండలంలో 54 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు దాఖలైనట్లు చెప్పారు.

ఆంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధికి నేడు శంకుస్థాపన

రేపల్లె, అక్టోబరు 11 : మండలంలోని పేటేరు బావాజీమఠం శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ భూమి పూజ చేయనున్నారని దేవదాయ శాఖ, కార్యనిర్వహణాధికారి దివి వెంకటఅప్పలాచార్యులు తెలిపారు. ఆంజనేయస్వామి దేవస్థానానికి సంబంధించిన ముఖమండపం పునఃనిర్మాణం, నూతన ధ్వజస్తంభం ఏర్పాటు, ప్రహరీ నిర్మాణాలకు భూమిపూజ చేయనున్నారని తెలిపారు. ఈ నిర్మాణాలకు రూ.50 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ తేనేటి కృష్ణప్రసాద్, దేవదాయ శాఖ అధికారులు పాల్గొంటారన్నారు. గ్రామంలోని పెద్దలు, గ్రామస్తులు పాల్గొనాలని ఆయన తెలిపారు.

వసూళ్ల ప్రచారంలో వాస్తవం లేదు


● రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి

బాపట్ల, అక్టోబరు 11 : రేషన్ డీలర్ల నుంచి సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ఓంకార్ డబ్బులు వసూళ్ళు చేస్తున్నాడంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవంలేదని బాపట్ల జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ విషయమై అసోసియేషన్ నాయకులతో కలిసి శుక్రవారం ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో దీనిపై జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చాలిచాలని ఆదాయంతో రేషన్ డీలర్లు ఇబ్బందిపడుతున్నారని, కుటుంబ పోషణ కూడా అంతంతమాత్రంగా ఉందన్నారు. ఇలాంటి పరిస్థితులలో అధికారులకు మాముళ్ళు ఇస్తున్నామనటం సరి కాదన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కె.రమేష్, సీహెచ్ ఆంజనేయులు, జి.దుర్గా, జి.వెంకటేశ్వర్లు, రూరల్ అధ్యక్షుడు రామకోటేశ్వరరావు, సురేష్, పిట్టలవానిపాలెం అధ్యక్షులు బాబి, వాలి ఆదినారాయణ, కర్లపాలెం అధ్యక్షులు ఎం.పరమానందకుమార్, బివి సుబ్బయ్య, భర్తీపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన


అమృతలూరు, అక్టోబరు 11 : తపాలా వారోత్సవాల్లో భాగంగా పోస్టల్ శాఖ ద్వారా అమలు అవుతున్న పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అమృతలూరులోని శ్రీప్రసన్నాంజనేయ గుడి సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో తెనాలి డివిజన్ సూపరింటెండెంట్ కరుణాకరబాబు పోస్టల్ ద్వారా అమలు అవుతున్న పథకాలపై వివరించారు. వడ్డీ చెల్లింపుల గురించి తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ పి.వెంకటస్వామి, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ డెవలప్‌మెంట్ అధికారి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.













లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన ఎంపీ తెన్నేటి


లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, అక్టోబరు 11 : లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై ఆయనతో చర్చించినట్లు ఎంపీ తెలిపారు. బాపట్ల పార్లమెంట్ పరిధిలోని పలు విషయాలను ప్రస్తావించినట్లు చెప్పారు.

వృత్తి విద్యా కోర్సుల ద్వారా బహుళ ప్రయోజనం

● జీసీడీవో చారులత


ఇంటర్న్‌షిప్ శిక్షణను పరిశీలిస్తున్న జీసీడీవో చారులత

వేమూరు, అక్టోబరు 11 : విద్యార్థుల్లో వృత్తి విద్యా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రత్యేకమైన ఒకేషనల్ కోర్సులను ప్రవేశ పెట్టడం జరిగిందని, తద్వారా విద్యార్థులకు బహుళ ప్రయోజనం చేకూరుతుందని సమగ్ర శిక్ష విభాగం జీసీడీవో చారులత అన్నారు. మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష, లెర్నట్ స్కిల్ లిమిటెడ్ వారి సహకారంతో ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ నిర్వహించారు. ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం, వాటి మరమ్మతులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పరిశీలించేందుకు హాజరైన చారులత మాట్లాడుతూ, విద్యార్థుల సామర్థ్యాలను పెంచుకునేందుకు ఒకేషనల్ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. శ్రద్ధతో కోర్సుల ద్వారా ప్రావీణ్యాన్ని పొంది తద్వారా ఉన్నతమైన ప్రమాణాలతో కూడిన విద్య కోర్సులను పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహస్వామి, ఒకేషనల్ ట్రైనర్ పుష్పలత పాల్గొన్నారు.


దాత పూర్ణలక్ష్మిని సన్మానిస్తున్న పార్వతీ అమ్మవారి దేవస్థాన బ్రాహ్మణ కమిటీ ప్రతినిధులు

దాతలకు దేవస్థాన బ్రాహ్మణ కమిటీ సన్మానం

కొల్లూరు, అక్టోబరు 11 : పార్వతీ అమ్మవారి దేవస్థానానికి వివిధ రూపాల్లో బంగారు, వెండి వస్తువులు బహూకరించిన దాతలను బ్రాహ్మణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా సత్కరించారు. కొల్లూరులోని అనంత భోగేశ్వర మల్లేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో ఉన్న పార్వతీ అమ్మవారికి ఈ ఏడాదిలో దాతలు చెరువు పూర్ణలక్ష్మి బంగారు హస్తాలు, పాదాలు, వడ్డాణం, వెండి కిరీటం, మకరతోరణం, రుద్రాక్ష మండపం, మరోదాత రావినూతల సూర్యనారాయణప్రసాద్ బంగారు చెవులు, వెండి సహస్రధార పాత్ర అందించారు. ఇరువురిని కమిటీ సభ్యులు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో కల్లూరి సూర్యనారాయణ, జనస్వామి గోపాలకృష్ణ, చెరువు భరద్వాజ, గాడేపల్లి రామకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సూర్యలంకరోడ్డులోని శ్రీలలిత త్రిపురసుందరి పీఠంలో శ్రీమహిషాసుర మర్దినిదేవి అలంకారం


శ్రీ శంకర విద్యాలయంలో శ్రీగాయత్రిఅమ్మవారు శ్రీ మహిషాసురమర్దినిగా అలంకరణ


పాతపట్నంలోని కన్యకాపరమేశ్వరిదేవాలయంలో మహిషాసురమర్దినిగా దుర్గాదేవి


అమ్మవారి స్వరూపంగా 58మంది ముత్తయిదవులకు సర్వోపచారాలతో వస్త్రాలు, తాంబూలాలతో సత్కరిస్తున్న నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు

శ్రీమహిషాసుర మర్దినిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


చావలి వాలేశ్వరాలయంలో మహిషాషురమర్థిని అలంకారం


భట్టిప్రోలులో మహిషాసురమర్థిని అలంకారంలో వాసవీ అమ్మవారు

బాపట్ల, అక్టోబరు 11 : శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు బాపట్ల పట్టణ, మండలంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు పలుప్రాంతాలలో శ్రీ మహిషాసురమర్దినిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సూర్యలంకరోడ్డులోని టౌన్‌హాలులో శ్రీ లలితత్రిపుర సుందరి పీఠం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న ఈ వేడుకలలో అమ్మవారు మహిషాసుర మర్దినిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఇష్టమైన సువాసినిపూజ 58మంది ముత్తయిదవులకు అమ్మవారి స్వరూపంగా సర్వోపచారాలతో వస్త్రాలు, తాంబూలాలతో సత్కరించారు. సాయంత్రం కుబేర కుంకుమార్చన, శ్రీషిరిడిసాయిభజన సమాజంవారిచే భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పీఠంనిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు, అర్చకులు పంగులూరి కౌండిన్యశర్మ, మల్లోలు లింగారావు, వక్కలగడ్డ బాలాజి, కొత్రా శ్రీనివాసరావు, ఉప్పాల హరికృష్ణ, పి.శివన్నారాయణ, దర్శి ప్రశాంత్ తదితరులు శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని జరిపించారు. అదేవిధంగా శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు మహిషాసుర మర్దినిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాతబస్టాండ్‌లోని శ్రీలక్ష్మీపద్మావతిసహిత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో, శ్రీశంకరవిద్యాలయంలో గాయత్రి అమ్మవారు, బాపట్ల గ్రామ అధిష్ఠానదేవత శ్రీపోలేరమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారు శ్రీమహిషాసురమర్దినిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీభావపురి బ్రాహ్మణసమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలలో భాగంగా జిల్లెళ్ళమూడి మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమత్ ప్రసాద్‌చే మహిషాసురమర్దిని ప్రవచనం గావించారు. సాయంత్రం మర్రిపూడి చెరువు విజయలక్ష్మీచే భక్తిసంగీతం ఏర్పాటు చేశారు.

● వేమూరు, అక్టోబరు 11 : శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం 9వ రోజు ఆలయాలలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని జయ జయహే మహిషాసురమర్థిని అంటూ కీర్తనలు ఆలపించారు. జంపని రామేశ్వరాలయంలో దప్పలపూడి నారాయణరావు దంపతులు సువాసిని పూజ జరిపించారు. పండిత మామిళ్లపల్లి వెంకటసుబ్బరాయశర్మ భక్తులతో సామూహికంగా శ్రీచక్ర పూజలు జరిపించారు. చావలి వాలేశ్వరాలయంలో, గ్రామదేవత గోగులమ్మ ఆలయంలో, అష్టదిక్కులలో గల రామ మందిరాలలో, జంపని చెన్నకేశవాలయంలో, వేమూరు, పెరవలి, అబ్బనగూడవల్లి, చదలవాడ, వరహాపురం, బూతుమల్లి, చంపాడు శివాలయాల్లో ఆలయ ఉత్సవాలు జరిపి భక్తుల గోత్రనామాలతో నక్షత్ర పూజలు చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

● పిట్టలవానిపాలెం, అక్టోబరు 11 : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో శ్రీదేవిశరన్నరాత్రి మహోత్సవాలలో భాగంగా శుక్రవారం తొమ్మిదవ రోజు శ్రీబగళాముఖి అమ్మవారు శ్రీ మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారని ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు తెలిపారు. భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసినట్లు తెలిపారు. అల్లూరులో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉన్న శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారు శ్రీ మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారని తెలిపారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, అక్టోబరు 11 : భట్టిప్రోలులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవీ మాత మహిషాసురమర్థిని అలంకారంలో దర్శనమిచ్చారు. రాత్రివేళ భట్టిప్రోలు, అద్దేపల్లి ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ముత్తైదువులకు అమ్మవారు కుంకుమ, పసుపు, పూలు, పండ్లు పంపిణీ చేశారు. కొల్లూరు అనంతభోగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు, కోటిపల్లిలో సత్యజ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు ధనలక్ష్మిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

● చుండూరు, అక్టోబరు 11 : నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 9వ రోజు వలివేరులోని శ్రీలలితాంబ సమేత శ్రీస్వయంభువేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్థినిగా భక్తులకు దర్శనమిచ్చారు. చినపరిమిలోని గంగా పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో చాముండేశ్వరిదేవిగా, మోదుకూరులో కనకదుర్గ అమ్మవారు స్వర్ణకవచాలంకృతగా అమ్మవారు దర్శనమిచ్చారు.

● అమృతలూరు, అక్టోబరు 11 : ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీమహిషాసుర మర్ధనిదేవిగా శుక్రవారం దర్శనమిచ్చారు. దేవీ శరన్నవరాత్రుల్లో బాగంగా స్వామి వారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన పూజలు చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ వెంకటశ్రీనివాసశర్మ నిర్వహించారు. ఏర్పాట్లును ఆలయ ఈవో అశోక్‌కుమార్ పర్యవేక్షించారు. మండల పరిధిలోని గ్రామాల్లో పలు అలయాల్లో, మందిరాల్లో శ్రీమహిషాసురమర్ధనిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.


అల్లూరు గ్రామంలో శ్రీమహిషాసురమర్దిని అలంకరణలో శ్రీరాజ్యలక్ష్మీఅమ్మవారు


మోదుకూరులో స్వర్ణకవచ కనకదుర్గగా అమ్మవారు


గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో శ్రీమహిషాసురమర్ధనిదేవి అవతారంలో అమ్మవారు







నిరుపేదలకు నిత్యావసర సరకులు అందజేస్తున్న అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు

అబ్దుల్ కలాం ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు చేయూత

కర్లపాలెం, అక్టోబరు 11 : కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ద్వారా ప్రతి శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఫౌండేషన్ అధ్యక్షుడు, గ్రామ ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా తెలిపారు. కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరుపేద మహిళలకు 10 కేజీల బియ్యం పంపిణీ చేశారు. ఈసందర్భంగా పఠాన్ భాషా మాట్లాడుతూ పేదలకు ప్రతి శుక్రవారం బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, అనారోగ్యంగా ఉన్న వారికి ఆర్థిక చేయూత అందించడం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ బాషా, ఉప్పాలపాటి వెంకటేశ్వరరాజు, షేక్ ఇబ్రహీం, బహదూర్ బాషా, షేక్ హబీబ్ పాల్గొన్నారు.

గుడికాయలంక సమీపంలో పొలం అమ్మబడును

బాపట్ల జిల్లా, రేపల్లె సబ్.డి., నగరం మండలం, మంత్రిపాలెం గ్రామ పంచాయితీ అల్లపర్రు గ్రామ పరిధిలోని, గుడికాయలంక సమీపంలో గల 01 ఎకరం మాగాణి పొలం అమ్మబడును.

సంప్ర॥ 9291462231

పట్టభద్రులంతా ఓటర్లుగా చేరండి.. విజయానికి సహకరించండి

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

బాపట్ల, అక్టోబరు 11 : పట్టభద్రులంతా ఓటర్లుగా చేరి రాబోయే కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు ఇచ్చి గెలిపించాలని మాజీ మంత్రి, కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కోరారు. బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధ్యక్షత వహించగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్స్ అంతా ఓటరుగా నమోదై మంచి పరిపాలనదక్షత కలిగిన చంద్రబాబునాయుడు నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు సలగల రాజశేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి శాశ్వత ఓటరు లిస్ట్ ఉండదు కావున ప్రతి ఎన్నికకు కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఏ అభ్యర్థి ఎక్కువగా ఓటర్లు నమోదు చేయించగలరో ఆ అభ్యర్థి గెలుపు తథ్యమన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి ఎన్నిక కావున ఎక్కువగా ఓటర్లు నమోదు కావాలని కోరారు. కూటమి ప్రభుత్వం బలంగా ఉందని నిరూపించుకోవటానికి ఇదొక అవకాశమన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, బాపట్లపరిశీలకులు సాంబిరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు తాతా జయప్రకాష్ నారాయణ, మానం విజేత, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పమిడి భాస్కరరావు తోట నారాయణరావు, తానికొండ దయాబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, జనసేన నాయకురాలు గుంటుపల్లి తులసీకుమారి తదితర నాయకులు పాల్గొని ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



సీసీ రోడ్డుపై కాల్వలా ప్రవహిస్తున్న వర్షపు నీరు

బాపట్లలో భారీవర్షం

బాపట్ల, అక్టోబరు 11 : బాపట్లలో భారీవర్షం కురిసింది. శుక్రవారం తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో కురిసిన భారీ వర్షంతో రోడ్లపై నీరు నిలిచింది. మార్కెట్ కూడలిలో వర్షం నీటిలో వ్యర్థాలు కలిసి దుర్గంధం వెదజల్లుతున్నాయి. మూడో వార్డు రాజీవ్‌గాంధీకాలనీలో, ఎస్టీకాలనీలో నిలిచిన నీటిని అధికారులు బయటకు పంపించకముందే మరలా కురిసిన భారీవర్షంతో ఎస్టీలకు చెందిన పాకలు చుట్టూ నీరు చేరింది. సీసీ రోడ్డుపై వర్షపు నీరు కాల్వలా ప్రవహించింది. అధికారులు తగు చర్యలు తీసుకొని ముంపు సమస్య తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బొర్రా శ్రీనివాసరావు

నగరం, అక్టోబరు 11 : ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు అందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఇన్‌చార్జ్ ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని వివిధ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. నూతనంగా ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు సచివాలయ కార్యదర్శులు వారధులుగా పని చేయాలని సూచించారు. ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న బొర్రా శ్రీనివాసరావు

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి



దుర్గాప్రసాద్ మృతదేహం

రేపల్లె, అక్టోబరు 11 : రోడ్డుమార్జిన్‌లో కూర్చుని ఉన్న వ్యక్తిని అతివేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొనటంతో నగరం మండలం తాడివాక వారిపాలెం గ్రామానికి చెందిన తాడివాక దుర్గాప్రసాద్(41)మృతి చెందినట్లు నగరం ఎస్ఐ భార్గవ్ తెలిపారు. పొలంలో శుక్రవారం కలుపుతీస్తూ విశ్రాంతి కోసం రోడ్డు పక్కన కూర్చుని సేదతీరుతున్న సమయంలో దుర్గాప్రసాద్‌ను ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టటంతో తీవ్రగాయాలపాలయ్యాడని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా దుర్గాప్రసాద్ మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై మృతుని భార్య దీపిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



దుర్గాష్టమి సందర్భంగా బూరుగులమ్మ దేవాలయంలో అమ్మవారులకు హారతులు ఇస్తున్న భక్తులు

మహిషాసురమర్ధనిగా దర్శనమిచ్చిన దుర్గాదేవీ

రేపల్లె, అక్టోబరు 11 : దసరా శరన్నవరాత్రుల మహోత్సవం సందర్భంగా 9వ రోజు శుక్రవారం ఉదయం విఘ్నేశ్వరపూజ, అమ్మవారికి కుంకుమపూజ, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక పూజ నిర్వహించారు. భక్తులకు దుర్గాష్టమి సందర్భంగా మహిషాసురమర్ధనిగా, దుర్గాదేవీగా దర్శనమిచ్చారు. బూరుగులమ్మ, కన్యకాపరమేశ్వరి దేవాలయంలో భక్తులచే కుంకుమపూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి భక్తులు హారతులిచ్చారు. ఆయా దేవాలయాల్లో మహిళలు లలితా సహస్రనామ పారాయణ చేశారు. కుంకుమార్చన, ఆయా ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను అందించారు.



కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కుంకుమపూజల్లో పాల్గొన్న భక్తులు





ప్రభుత్వం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి

- ఆపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసకుమార్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసకుమార్

వేమూరు, అక్టోబరు 11 : ప్రభుత్వం ఉద్యోగులకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఇవ్వాల్సిన వేతన సవరణ, పీఆర్‌సీ అనేక కారణాల వల్ల ఆలస్యం అవుతుందని ఈ విధంగా ప్రతిసారి జరగడం వల్ల ఉద్యోగులు రెండు పీఆర్‌సీలు కోల్పోయే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసకుమార్ ఆవేదన వ్యక్తపరిచారు. ఆయన శుక్రవారం వేమూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, కనీసం ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా మధ్యంతర భృతిని ప్రకటించి పీఆర్‌సీకి కొత్త కమిషన్ వేయాలని కోరారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీఆర్‌సీ రద్దు అయినందువల్ల కొత్త పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం


ర్యాలీలో పాల్గొన్న వైస్ ఎంపీపీ రాంబాబు, ఉపసర్పంచ్ గోపాలకృష్ణ

కొల్లూరు, అక్టోబరు 11 : అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కొల్లూరు ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన బాలికా దినోత్సవంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఉప సర్పంచ్ ధూళిపూడి గోపాలకృష్ణ పాల్గొని మాట్లాడుతూ, బాలికలను సంరక్షించుకోవాలన్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

రైతుబజార్‌కు మోక్షం ఎప్పటికో?

బాపట్ల, అక్టోబరు 11 : వైసీపీ పాలనలో మూలనపడి శిథిలావస్థకు చేరిన బాపట్ల రైతు బజారును ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధికారులను ఆదేశించారు. రైతుప్రయోజనాల దృష్ట్యా దీనిని రైతులకు అంకితం చేయాలని ఆయన భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. అయినప్పటికి నేటి వరకు రైతుబజారు ప్రారంభానికి నోచుకోలేదు. దీనివల్ల సన్న,చిన్నకారు రైతులు వారు పండించిన ఉత్పత్తులను రోడ్లమీద పెట్టుకొని అమ్ముకుంటున్నారు. బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డు నిధులు 60లక్షల రూపాయలు వెచ్చించి సన్న,చిన్నకారు రైతుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన రైతుబజారు దుకాణాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. కేవలం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన కారణంగానే దీనిని నిర్లక్ష్యం చేశారు. 2019 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ రైతుప్రయోజనాల దృష్ట్యా దీని నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టి రైతులకు అంకితం చేశారు. కొద్దిపాటి భూములలో కూరగాయలు, ఆకుకూరలు పండించుకునే రైతులు రైతు కార్డు తీసుకొని ఈ రైతుబజారులో ఏవిధమైన అద్దె లేకుండా తమ ఉత్పత్తులను విక్రయించుకునే ఏర్పాటు చేశారు. దీని కోసం 56 షాపులు నిర్మించారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీనాయకులు దీనిని నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా మద్యంబాబులకు అడ్డాగా మారింది. రైతుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ తుప్పు పట్టి పనికిరాకుండా పోతున్నది. యువకులు మద్యం తెచ్చుకొని ఈ ప్రాంతంలో కూర్చొని పట్టపగలు కూడా తాగుతూ కనిపిస్తున్నారు. మార్కెట్‌కు వచ్చేవారు వీరి ఆగడాలు చూచి భయపడుతున్నారు. అయినప్పటికి అధికారులు చోద్యం చూస్తున్నారు. దీనికితోడు కూరగాయల మార్కెట్‌లోని బడా వ్యాపారులు రైతుబజారు ప్రారంభమైతే తమకు వ్యాపారం తగ్గుతుందనే భయంతో దానిని ప్రారంభించకుండా అడుకుంటున్నారు. ఫలితంగా రైతులు ఆశించినది నెరవేరలేదు. ఎప్పటిలాగే రోడ్ల వెంట తట్టులు, మూటలు పెట్టుకొని కూరగాయలు, ఆకుకూరలు అమ్ముకుంటున్నారు. కేవలం టీడీపీ హయాంలో నిర్మించారన్న కారణంతోనే దీనిని నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పాలుకులు, అధికారులు పరిశీలించి ప్రారంభించకుండా వదిలేశారు. ప్రారంభానికి తగువిధంగా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.


బాపట్ల కూరగాయల మార్కెట్ సమీపంలోని రైతుబజారు


రైతుబజారులోని షాపుల సముదాయం

రేపల్లెలో మద్యం షాపులకు 131 దరఖాస్తులు


ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ దివాకర్

రేపల్లె, అక్టోబరు 11 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీలో భాగంగా మద్యం షాపులకు పట్టణం, మండలంలో 131 దరఖాస్తులు వచ్చాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ ఆర్.దివాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మున్సిపాల్టీ పరిధిలో మూడుషాపులకు 42 దరఖాస్తులు వచ్చాయని, రేపల్లె రూరల్ మండలానికి సంబంధించిన నాలుగు షాపులకు 37 దరఖాస్తులు అందాయని తెలిపారు. భట్టిప్రోలు మండలంలోని 5 షాపులకు 52 దరఖాస్తులు మొత్తం 131 దరఖాస్తులు అందాయని తెలిపారు. తద్వారా రూ.2 కోట్ల 62 లక్షలు ఆదాయం వచ్చిందని తెలిపారు.

నగరం ఎక్సైజ్ పరిధిలో 160 మద్యం షాపులకు దరఖాస్తులు అందాయని ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్ తెలిపారు. నగరంలోని మూడు షాపులకుగాను 38 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. నిజాంపట్నం మండలంలోని నాలుగు షాపులకు 55 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. చెరుకుపల్లి మండలంలో 6 షాపులకు 67 దరఖాస్తులు అందాయని చెప్పారు. మొత్తం 160 షాపులకు రూ.3 కోట్ల 20 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు.

హేమవిరలేశ్వరస్వామి వారి సువాసినీ పూజలు

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 11 : భట్టిప్రోలు హేమవిరలేశ్వరస్వామి దేవస్థానంలో సువాసినీ పూజలు నిర్వహించినట్లు సమాజ వ్యవస్థాపకులు అల్లం వెంకటేశ్వరరావు తెలిపారు. శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా తొమ్మిది మంది దీక్షాపరులైన మహిళలకు సువాసినీ పూజను బాలత్రిపురసుందరీ మహిళా సమాజం, గాయత్రి పరివార్ సభ్యులు సంయుక్తంగా చేసినట్లు శుక్రవారం చెప్పారు. నవరాత్రుల్లో లలితాదేవిని పూజిస్తే సమస్యలు తొలగుతాయని, ఆందోళనలు దూరం అవుతాయన్నారు. ఆయా కార్యక్రమాలను కేవీ రామారావు పర్యవేక్షించారు. శనివారం సాయంత్రం 7 గంటలకు శమీ పూజ నిర్వహిస్తామని వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.


సువాసినీ పూజల్లో పాల్గొన్న దీక్షాపరులు

లారీ ఢీకొని గేదె మృతి

బాపట్ల, అక్టోబరు 11 : బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో హైవేరోడ్డుపై అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టటంతో గేదె మృతి చెందింది. సుమారు లక్షా 20 వేల రూపాయల విలువ చేసే గేదె లారీ ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో బాధిత రైతు, స్థానికులు లారీని ఆపేశారు. మలుపులో అతివేగంగా వాహనాలు రావటం వల్ల తరుచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై అధికారులు చర్యలు తీసుకొని ప్రమాదాలు నివారించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



















నిర్మాణానికి నోచుకోని బాపట్ల శాఖా గ్రంథాలయం

- ఆరు దశాబ్దాలుగా అద్దె భవనంలోనే

బాపట్ల, అక్టోబరు 11 : అరుదశాబ్దాల ఘనచరిత్ర కలిగిన బాపట్ల శాఖా గ్రంథాలయం నేటికి అద్దె భవనంలోనే కునారిల్లుతున్నది. గ్రంథాలయ గాంధీగా పేరుగాంచిన వెలగ వెంకటఅప్పయ్యలాంటి ఉద్దండులు ఇక్కడ గ్రంథాలయాధికారులుగా పని చేశారు. దాదాపు 25వేల పుస్తకాలు ఈ గ్రంథాలయంలో ఉన్నాయి. అయినప్పటికి నాటి నుంచి నేటి వరకు అద్దె భవనంలోనే కొనసాగుతున్నది. పాలకులు మారినా దీని గురించి పట్టించుకునేవారే లేకపోయారు. గ్రంథాలయ విశిష్ఠత, అవసరత తెలిసిన వారు కూడా సొంత భవన నిర్మాణానికి కృషి చేయలేదు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గాదె వెంకటరెడ్డి కృషితో ఆంజనేయ అగ్రహారం స్కూల్ ప్రాంగణంలో 8 సెంట్ల భూమిని కేటాయించి దశాబ్దన్నర క్రితం శంకుస్థాపన కూడా చేశారు. పురపాలక సంఘం వారు స్థలాన్ని కేటాయించారు. 2013లో అప్పటి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి శైలజనాథ్ శంకుస్థాపన కూడా చేశారు. కాని నిధులు కొరత వల్ల జిల్లా గ్రంథాలయ సంస్థ వారు భవన నిర్మాణం చేపట్టలేదు. ఆ తర్వాత శంకుస్థాపన చేసిన గుంతను పూడ్చేశారు. శిలాఫలకాన్ని తొలిగించారు. ఎప్పటిలాగానే అద్దెభవనంలో గ్రంథాలయాన్ని కొనసాగిస్తున్నారు. పాఠకులు ఆశించిని విధంగా అధునాతన గ్రంథాలయ భవనం నిర్మాణానికి నోచుకోలేదు.

గ్రంథాలయ సంస్థకు రూ.కోటి బకాయి

బాపట్ల పురపాలక సంఘం నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థకు సుమారు కోటి రూపాయల వరకు బకాయి పడ్డారు. గ్రంథాలయ సెస్ బకాయిలు కింద రావాల్సి ఉంది. ప్రజలు నుంచి ఆస్తి పన్నులో భాగంగా వసూళ్ళు చేస్తున్న గ్రంథాలయ సెస్‌ను పురపాలక సంఘం వారు జిల్లా గ్రంథాలయ సంస్థకు జమచేయటం లేదు. ఫలితంగా నిధులు కొరత ఏర్పడుతున్నది. దీనిపై జిల్లా గ్రంథాలయాధికారులు అనేకసార్లు మున్సిపల్ అధికారులను సంప్రదించి సెస్ బకాయిలు చెల్లించాలని కోరినప్పటికి ఫలితం లేకుండాపోయింది. పురపాలక సంఘమే అప్పులలో ఉందని, అభివృద్ధి పనులకు నిధులు అంతంతమాత్రంగానే వస్తున్నాయని మున్సిపల్ అధికారులు అంటున్నారు. మున్సిపాలిటీ వారు సెస్ బకాయిలు చెల్లించేది ఎప్పుడు, నూతన గ్రంథాలయ భవనం నిర్మించేది ఎప్పుడు అని పాఠకులు, పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై స్పందించి ప్రజలకు ఉపయోగపడే విధంగా అధునాతన గ్రంథాలయ భవనం నిర్మించాలని పాఠకులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.



బాపట్లలో శాఖా గ్రంథాలయం నిర్వహిస్తున్న అద్దె భవన సముదాయం

బాలికా సంరక్షణతో ఆరోగ్యవంతమైన సమాజం

- ఇనకొల్లు పోలీసురావు

కర్లపాలెం, అక్టోబరు 11 : బాలికా సంరక్షణతో ఆరోగ్యవంతమైన సమాజం స్థాపించవచ్చుని, సమసమాజ స్థాపనకు బాలిక విద్య తోడ్పడుతుందని కర్లపాలెం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ ఇనకొల్లు పోలీసురావు అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కర్లపాలెంలో శుక్రవారం స్థానిక లంకలో ఉన్న గిరిజన బాలికలకు నోటుపుస్తకాలు, ఆహారపదార్థాలు పోలీసురావు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ పరమానంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన బాలికలకు నోట్‌పుస్తకాలు అందజేస్తున్న పోలీసురావు తదితరులు

ఘనంగా శ్రీ నాంచారమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

కర్లపాలెం, అక్టోబరు 11 : కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామ దేవత శ్రీ నాంచారమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో పలువురు పండితులు, భక్తులు శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల, గుంటూరు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాడసాని ముసలయ్య, ఇమడాబత్తిని నరసయ్య, ఎ.శ్రీనివాసరావు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

చెడుపై మంచి సాధించిన రోజు విజయ దశమి

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, అక్టోబరు 11: చెడుపై మంచి సాధించిన విజయం సందర్భంగా నిర్వహించుకునే విజయదశమి పర్వదినం సందర్భంగా దుర్గా మాత ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని, జిల్లాలోని పాడి రైతులందరికీ సకల శుభాలు కలగాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆకాంక్షించారు. ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలను తెలియజేశారు. జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, కాంగ్రెస్ ఇన్‌చార్జి జక్క రవీంద్రనాథ్, బీజేపీ పట్టణ, మండల అధ్యక్షుడు గోవాడ వెంకటకృష్ణారావు, వడ్రాణం ఉదయ్ చంద్రరావు, పలు రాజకీయ పార్టీల నాయకులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

పారిశుధ్యంపై అసిస్టెంట్ కమిషనర్ సమీక్ష

తెనాలి, మారీసుపేట అక్టోబరు 10: పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలు, నగర దీపికలతో మున్సిపల్ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు శానిటేషన్‌పై సమీక్ష నిర్వహించారు. వార్డులలో శానిటేషన్ పనులను పారిశుధ్య కార్మికులు సక్రమంగా నిర్వహించేలా చూడాలని అసిస్టెంటు కమిషనర్ ఆదేశించారు.

నేడు 70 మంది రైతులకు తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ

పొన్నూరు టౌన్, అక్టోబరు 11: మండల పరిధిలోని మునిపల్లెలో శనివారం 70మంది రైతులకు తైవాన్ స్ప్రేయర్ల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర చేతుల మీదుగా జరగనునట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

రాయితీపై వంట నూనె కేంద్రాలు ప్రారంభం

పొన్నూరు టౌన్, అక్టోబరు 11: పొన్నూరు పురపాలక సంఘం పరిధిలో రాయితీపై అందించే వంట నూనె పంపిణీ కేంద్రాలను ప్రారంభించినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు. శుక్రవారం పొన్నూరు పట్టణంలోని ఆరు కేంద్రాలను ప్రారంభించారు. పట్టణంలోని సత్యనారాయణ ట్రేడర్స్, వినాయక ఆయిల్ ట్రేడర్స్, విఘ్నేశ్వర ఆయిల్ జనరల్ ట్రేడర్స్, వెంకట గాయిత్రీ ట్రేడర్స్, వెంకటేశ్వర ఆయిల్ జనరల్ ట్రేడర్స్, వెంకట సత్యసాయి ఆయిల్ ట్రేడర్స్ ఈ రాయితీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పామాయిల్ లీటర్ రూ.119, సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ రూ.130 ఈ కేంద్రాలో విక్రయించనునట్లు చెప్పారు.

విద్యారంగాన్ని పరిరక్షించాలి

- ఏపీటీఎఫ్ మాజీ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాదరావు

తెనాలి అర్బన్, అక్టోబరు 11: ప్రభుత్వ పాఠశాలల విద్యారంగాన్ని పరిరక్షించాలని ఏపీటీఎఫ్ మాజీ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు కోరారు. తెనాలి జోన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టా జనార్ధన్ అధ్యక్షతన అధ్యయన తరగతులు నిర్వహించారు. విద్యారంగ పరిణామాలు-సమస్యలు అనే అంశంపై ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం ప్రాథమిక విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందని, వేలాది పాఠశాలలు మూతపడే స్థితికి చేరాయన్నారు. మాతృభాషను లేకుండా చేసి జాతి అస్తిత్వాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. విద్యా ప్రమాణాలు నానాటికి దిగజారుతున్నాయని, 117 జీవో రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన ప్రాథమిక తరగతులను వెనక్కి పంపాలన్నారు. జిల్లా అధ్యక్షుడు బసవలింగారావు మాట్లాడుతూ, గత ప్రభుత్వం నిర్బంధకాండను అమలుచేసి ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీసిందన్నారు. పాతతరం నాయకుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని కొత్తతరం పాఠశాలల పరిరక్షణకు ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. షేక్ జిలాని, మహ్మద్‌ఖలీద్, లక్ష్మణ్, శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెలా గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

- మండల వైద్యాధికారి లక్ష్మీసుధ

కొల్లిపర, అక్టోబరు 11: ప్రతి నెల గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని మండల వైద్యాధికారి లక్ష్మీసుధ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మీసుధ మాట్లాడుతూ గర్భిణులు వైద్యాధికారుల సూచనలను, సలహాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. గర్భిణులు పోషక విలువైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వేముల ప్రియాంక, హెల్త్ విజిటర్స్ ఆశీర్వాదమ్మ, అత్తోట కవిత, ఆరోగ్య కార్యదర్శి స్వరూపరాణి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హోఫ్‌పేటలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం

తెనాలి రూరల్, అక్టోబరు 11: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ఆధ్వర్యంలో మండలంలోని హోఫ్‌పేటలో బాలికల హక్కులపై ప్రదర్శన నిర్వహించి అవగాహన కల్పించారు. క్రాఫ్ జిల్లా కో ఆర్డినేటర్ జి.వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలల పంచాయతీ సభ్యురాలు పిల్లి దీపిక, సౌభాగ్యం, నక్కా మౌనిక, మైత్రి, సంధ్య, హాసిని తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

తెనాలి, మారీసుపేట అక్టోబరు 11: స్థానిక శివాజీచౌక్‌లోని శ్రీకాళీ మాతా దేవాలయం వద్ద దేవీ నవరాత్రులలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. శ్రీ కాళీ మాత దేవస్థాన కమిటీ అధ్యక్షుడు గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దశరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం రాత్రి జంధ్యాల శ్రీరామచంద్రమూర్తి శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనను నిర్వహించారు. చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. అనంతరం నాట్యచార్యులు జంధ్యాల శ్రీరామచంద్రమూర్తిని దుశ్శాలవాతో కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో యర్రా శ్రీనివాసరావు, కందేపి సీత రామయ్య, ఉమ్మలనేని ధర్మారావు, నక్కా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారికి తోపుడు బండి వితరణ

తెనాలి, మారీసుపేట అక్టోబరు 11: స్థానిక ఐతానగర్ లింగారావు సెంటర్‌లో శుక్రవారం యంగ్ జనరేషన్ టీం అధ్యక్షుడు షేక్ సాదిక్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారి తెనాలి ఇస్సాక్‌కు తోపుడు బండిని అందజేశారు. ఈ సందర్భంగా టీం అధ్యక్షుడు సాదిక్ మాట్లాడుతూ ముఠా కార్మికుడిగా పనిచేస్తున్న ఇస్సాక్‌కు వయసు పైబడటంతో అనారోగ్యానికి గురై గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. అతని బతుకుతెరువు కోసం కూరగాయల వ్యాపారానికి తోపుడు బండిని అందించామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది హరిదాసు గౌరిశంకర్, శివ, టీం సభ్యులు పాల్గొన్నారు.


పారిశుధ్యం మెరుగుపరచటమే ప్రధాన లక్ష్యం

- కమిషనర్ రమేష్ బాబు

పొన్నూరు టౌన్, అక్టోబరు 11: పురపాలక సంఘంలో పారిశుధ్యం మెరుగుపర్చటమే ప్రధాన లక్ష్యం అని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద మొలిచిన పిచ్చి చెట్లు, చెత్తను శుక్రవారం తొలగించారు. అలాగే పలు వార్డులో పర్యటించి గృహాల మధ్య నిల్వ ఉన్న చెత్త తొలగింపుకు ఆదేశాలు ఇచ్చారు. జీబీసీ రోడ్డులోని బాపట్ల వెళ్లే రహదారిలో వర్షపునీరు రహదారుల వెంట నిల్వ ఉండి పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వచ్చిన ఫిర్యాదులపై కమిషనర్ స్పందించారు. తక్షణమే రహదారులపై నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించి నీటి ప్రవాహానికి అవరోధంగా ఏర్పడిన మట్టి తొలగింపు చర్యలకు ఆదేశించారు.

ఈ సందర్భంగా కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ స్వచ్ఛ పొన్నూరుకు పట్టణ వాసులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.














చెడుపై మంచి సాధించిన విజయం
ఈ ఎన్నికల్లో మన విజయమే సాక్ష్యం
విజయదశమి ఈ సాంప్రదాయ పండుగ, చెడుపై మంచి సాధించిన ఘన విజయానికి చిహ్నం.
ఈ సంవత్సరం జరిగిన ఎన్నికల్లో కూటమి పార్టీ సాధించిన విజయం, ఈ పండుగకు మరింత
ప్రాముఖ్యత చేకూరుస్తోంది. ప్రజల మద్దతు, నాయకత్వం, మరియు సంకల్పం ఈ విజయానికి
బలమైంది. ఈ విజయవంతమైన దారిలో మనందరం పునః ఆశాజనకంగా ముందుకు సాగుదాం.
దుర్మార్గాలను పారద్రోలుతూ, మంచి మార్గంలో దేశాన్ని నడిపే ప్రయత్నంలో కూటమి పార్టీ
అగ్రగామిగా నిలవడం మనందరికీ గర్వకారణం.
ఈ విజయదశమి అందరికీ మంచి జరగాలి ఆ దుర్గాదేవి కృపా కటాక్షాలు మందందరికీ దక్కాలి.
జిల్లా కలెక్టర్ గారికి, జాయింట్ కలెక్టర్ గారికి,
SP గారికి, ప్రభుత్వ అధికారులకు, ఉద్యోగులకు మరియు
బాపట్ల నియోజకవర్గ ప్రజలందరికీ
దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు
వేగేశన నరేంద్ర వర్మ, శాసన సభ్యులు
బాపట్ల నియోజకవర్గం


Bapatla Engineering College
(Autonomous)
Estd: 1981
Sponsored by Bapatla Education Society
BAPATLA ENGINEERING COLLEGE
BAPATLA
1981
WORK IS WORSHIP
ACCREDITED WITH GRADE
A+
NAAC
3.49/4
BAPATLA ENGINEERING COLLEGE
◆ NAAC, NBA accredited, ISO Certified Institution
◆ 1 Gbps internet leased line (ILL) with Wifi enabled campus
◆ Futurisitc Research and Practice Centers with Siemens Excellence Lab, Bosch Lab, Robotics Lab with KUKA Robot, DELL Center of Excellence, IOT Lab, CAM Lab and Production Center with CNC Machines. Auto Electronics COE Lab
◆ Center for innovation Incubation and Entrepreneurship (CIIE) is constituted to accelerate the process of Startups & Entrepreneurship Ecosystem in the Campus.
◆ Peaceful and discipline Learning Environment.
◆ Skills honing, co-curricular and extra-curricular activities.
◆ Student Can opt for Honors & Minor Degree
becbapatlaofficial
@becbapatlaofficial
@BapatlaC
www.becbapatla.ac.in
B.TECH.
- Computer Science and Engineering
- CSE with Cyber Security
- CSE with Data Science
- CSE with Artificial Intelligence & Machine Learning
- Civil Engineering
- Electronics & Communication Engineering
- Electrical & Electronics Engineering
- Information Technology
- Mechanical Engineering
M.TECH.
- Computer Science and Engineering
- Civil (Structural Engineering)
- E.C.E. (Communication Engg. & Signal Processing
- E.E.E (Power Systems Engineering)
- Mechanical (CAD/CAM)
M.Sc. / MCA
- M.Sc. (Maths.)
- M.Sc. (Computers)
- M.Sc. (Organic Chemistry)
- M.Sc. (Physics)
- M.Sc. (Analytical Chemistry)
- M.C.A (Master of Computer Application)
DIPLOMA
- Computer Engineering
- Civil Engineering
- Electronics & Communication Engineering
- Electrical & Electronics Engineering
- Mechanical Engineering
TRAINING AND PLACEMENT CELL
50+ RECRUITERS
10 LPA HIGHEST PACKAGE
43 Years of Excellence
NBA CSE, CE, ME & EEE
ISO
UGC AUTONOMOUS
30% Faculty with Ph.D
90% Campus Placements for the A.Y. 2023-24
Ministry of Education recognised Innovation Cell. Complete Internship in 8th semester leading to Jobs
BAPATLA ENGINEERING COLLEGE (AUTONOMOUS)
COURSES OFFERED:
B.Tech: CIVIL, CSE, CSE- Data Science, CSE-Cyber Security, CSE- Artificial Intelligence & Machine Learning, ECE, EEE, EIE, IT, MECH.
M.Tech: CIVIL, CSE, ECE, EEE, MECH.
Diploma: CSE, CIVIL, ECE, EEE, MECH.
MCA, PG in Sciences.
Cell : +91 9440730035
EAPCET CODE: BECB
BAPATLA WOMEN'S ENGINEERING COLLEGE
COURSES OFFERED:
B.Tech: CSE, ECE, ARTIFICIAL INTELLIGENCE & MACHINE LEARNING.
Cell : +91 92474 61678
EAPCET CODE: BWEC
BAPATLA COLLEGE OF PHARMACY
COURSES OFFERED : D. Pharmacy, B. Pharmacy, M.Pharmacy
Cell : +91 94409 38249
EAPCET CODE: BCOP
BAPATLA POLYTECHNIC COLLEGE
COURSES OFFERED : CSE, ECE, EEE, MECH.
Cell : +91 99123 42106
EAPCET CODE: BPBP
Ph : 94407 30035, 94418 68242 | E-mail : bec.principal@becbapatla.ac.in | www.becbapatla.ac.in



300 క్వింటాళ్ల బియ్యం సీజ్

పంగులూరు, అక్టోబరు11: మండలంలోని కశ్యాపురం సమీపంలో రైస్‌మిల్‌లో అక్రమంగా నిల్వ చేసిన 300 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. వివరాలలోకి వెళితే.. కశ్యాపురం సమీపంలోని స్వప్న రైస్‌మిల్‌లో శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. 300 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు డీఎస్‌వో విలియమ్స్ తెలిపారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

మంత్రి గొట్టిపాటి విజయదశమి శుభాకాంక్షలు

అద్దంకి, అక్టోబరు11: అద్దంకి నియోజవర్గ ప్రజలకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి విజయమే విజయదశమి అని అన్నారు. విజయదశమిని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

సిమెంట్ రోడ్లకు రూ. 3.90 కోట్ల నిధులు మంజూరు

బల్లికురవ. అక్టోబరు 11 : మహత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో పెద్ద ఎత్తున సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి రూ. 3.90 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. ప్రభుత్వం 14 వ తేదీ నుంచి 20 వరకు అన్నీ గ్రామాలలో పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందని, గ్రామ సభలు ఏర్పాటు చేసి సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.













మహిషాసురమర్దనిగా అమ్మవారు

మేదరమెట్ల,అక్టోబరు 11 : దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా దైవాలరావూరులోని ఉమామహేశ్వరీ ఆలయంలో, మేదరమెట్లలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవార్లు శుక్రవారం మహిషాసుర మర్దని దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



లారీని ఢీకొన్న ట్యాంకర్

- డ్రైవర్ మృతి

మేదరమెట్ల, అక్టోబరు 11: జాతీయ రహదారిలో కొరిశపాడు వద్ద ఆగి ఉన్న లారీని ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో ట్యాంకర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం అర్ధరాత్రి 12గంటల సమయంలో గుంటూరు వైపు నుంచి చెన్నై వైపు వెళ్తున్న ఖాళీ ఆక్సిజన్ ట్యాంకర్ కొరిశపాడు ఫ్లైఓవర్ సమీపంలో మరమ్మతుల కోసం ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొంది. ఈ సంఘటనలో బిహార్ రాష్ట్రం పాట్నాకు చెందిన దిలీప్ పాశ్వాన్(43) అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తే కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదంలో ట్యాంకర్‌లో ఇరుక్కుపోయిన పాశ్వాన్ మృతదేహాన్ని బయటకు తీయడాకిని పోలీసులకు మూడు గంటలకుపైగా సమయం పట్టింది. మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ సంఘటన స్థలాన్ని పరిశీలించి రవాణాకు ఆటంకం లేకుండా చేశారు.

దొంగలు బాబోయ్ దొంగలు

- దేవాలయాలే లక్ష్యంగా చోరీలు

పర్చూరు, అక్టోబరు 11: పర్చూరు మండలంలో ఏక కాలంలో అనేక గ్రామాల్లో చోరీలు చోటుచేసుకోవటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దేవాలయాలే లక్ష్యంగా దొంగలు చోరీకి పాల్పటం ఇందుకు నిదర్శనం. గురువారం అర్ధరాత్రి మండలంలోని కొత్తపాలెం, బోడవాడ, గ్రామాల్లో ఏక కాలంలో చోరీలు జరిగాయి. కొత్తపాలెం పోలేరమ్మ అమ్మవారి ఆలయ ప్రధాన ద్వారం, హుండీ తాళాలు పగులకొట్టి రూ.40వేల వరకు నగదుతో దొంగలు ఉడాయించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో ఇటీవల అమ్మవారి కొలుపులు నిర్వహించి ఉండటంతో పెద్ద మొత్తంలోనే నగదు చోరీ అయినట్లు సమాచారం. అదేవిధంగా బోడవాడ రామాలయంలో ఏర్పాటు చేసిన హుండీని పగులకొట్టి అందులో ఉన్న నగదును చోరీచేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇలాంటి సంఘటనలు ఇటీవల ఇంకొల్లు మండలం పావులూరు, ఇడుపులపాడులో చోటుచేసుకోవటం గమనార్హం.

15 వైన్ షాపులకు 445 దరఖాస్తులు

పర్చూరు, అక్టోబరు 11: పర్చూరు ఎక్సైజ్ సబ్‌డివిజన్ పరిధిలోని పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, యద్దనపూడి మండలాలకు సంబంధించి మొత్తం 15 మద్యం షాపుల టెండర్లకు 445 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సీఐ ఎం.భుజంగరావు తెలిపారు.















అద్దంకిలో 23 షాపులకు 345 దరఖాస్తులు

అద్దంకి, అక్టోబరు11: అద్దంకి నియోజకవర్గంలో 23 మద్యం షాపుల ఏర్పాటుకు 345 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అద్దంకి సర్కిల్ సీఐ భవాని తెలిపారు. శుక్రవారం రాత్రి 7 గంటలకు సమయం ముగియగా 345 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అద్దంకి టౌన్‌లో 5 షాపులకు 83, మండల పరిధిలో రెండు షాపులకు 17, బల్లికురవ మండలంలో 4షాపులకు 54, సంతమాగులూరు మండలంలో 5 షాపులకు 53, కొరిశపాడు మండలంలో 4 షాపులకు 71, పంగులూరు మండలంలో 3 షాపులకు 67 దరఖాస్తులు అందినట్లు సీఐ భవాని తెలిపారు. పంగులూరు మండలంలోని 102 వ షాపునకు అత్యధికంగా 24 దరఖాస్తులు, 101 వ నెంబరు షాపునకు 22, 100 వ షాపునకు 21 దరఖాస్తులు అందాయి. అత్యల్పంగా అద్దంకి రూరల్ మండలంలోని 86 వ షాపునకు 8, 85 వ షాపునకు 9 దరఖాస్తులు అందాయి.

శ్రీశైలంలో మంత్రుల ప్రత్యేక పూజలు


శ్రీశైలంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రులు గొట్టిపాటి , అనగాని సత్య ప్రసాద్

అద్దంకి, అక్టోబరు11: శ్రీశైలంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్య ప్రసాద్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి పొద్దుపోయిన తరువాత ప్రత్యేక పూజలకు రవికుమార్, అనగాని సత్య ప్రసాద్‌లు హాజరయ్యారు. ప్రత్యేక పూజల అనంతరం వారిని దేవాలయ అధికారులు, పూజారులు సత్కరించి, ఆశీర్వదించారు.

గంజాయి వినియోగిస్తున్న ఏడుగురి అరెస్ట్

అద్దంకి, అక్టోబరు11: అద్దంకి పట్టణంలో గంజాయి వినియోగిస్తున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు టౌన్ సీఐ కృష్ణయ్య తెలిపారు. ఇటీవల నలుగురు గంజాయి విక్రయదారులు, రవాణాదారులను పోలీసులు అరెస్ట్ చేయగా, వారి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఏడుగురు వినియోగదారులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నారన్నారు.

మహిషాసుర మర్దనిగా...

అద్దంకి, అక్టోబరు 11: దసరా ఉత్సవాలలో భాగంగా శుక్రవారంపలు దేవాలయాలలో అమ్మవార్లను మహిషాసుర మర్దని దేవిగా అలంకరించారు. అద్దంకి పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారిని మహిషాసుర మర్దనిదేవి గా అలంకరించారు. దత్తపాదుకా క్షేత్రంలో చండీ హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. శింగరకొండలోని గాయత్రీ పరమేశ్వరి ఆలయంలో మహంకాళిదేవి అలంకారంలో అలంకరించారు.

త్రిశక్తిపీఠం ప్రథమ వార్షికోత్సవం

పంగులూరు :మండలంలోని రేణంగివరంలో త్రిశక్తిపీఠం ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీఠంలో కొలువుదీరిన పోలేరమ్మ, గంగమ్మ, నాంచారమ్మ అమ్మవార్లకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా 12వ తేదీ శనివారం తిరునాళ్ల జరుగుతుందని, ఈ సందర్భంగా గ్రామ తెలుగుయువత ఆధ్వర్యంలో 90 అడుగుల విద్యుత్ ప్రభ ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ నేత బోరెడ్డి ఓబుల్‌రెడ్డి తెలిపారు.

పర్చూరు : పర్చూరులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి, అద్దంకి నాంచారమ్మ అమ్మవారి దేవస్థానం, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంతోపాటు, చెరుకూరులోని శ్రీ అగస్తేశ్వరస్వామివార్ల ఆలయంలో అమ్మవారిని మహిషాసురమర్దనిగా అలంకరించి ప్రత్యేక పూజాకార్యక్రమాలు చేశారు. కారంచేడులోని శ్రీ వైష్ణవి దుర్గా ఆలయంలో శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

చినగంజాం : స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి మందిరంలోని అమ్మవారిని శుక్రవారం కనకదుర్గాదేవిగా అలంకరించారు. సోపిరాల గ్రామంలోని రామకోటేశ్వర స్వామి ఆలయంలోని లలితా పరమేశ్వరి అమ్మవారు, రైల్వే సెంటర్ భవానీపురంలోని విజయకనకదుర్గాభవాని అమ్మవారు మహిషాసురమర్దినిగా కనువిందుచేశారు.

పంగులూరు: రేణంగివరం గ్రామంలోని పోలేరమ్మతల్లిని మహిషాసురమర్దనిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ముప్పవరం గ్రామంలోని శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానంలో లక్ష కుంకుమార్చన పూజా కార్యక్రమం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది.

వర్షాలకు కూలిన ఓ ఇంటి స్లాబు - తప్పిన ప్రమాదం

చీరాల, అక్టోబరు 11 : మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో భాస్కరరావు అనే టీడీపీ క్రియాశీలక కార్యకర్త ఇంట్లో ఓ గది పైశ్లాబు గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షానికి కూలింది. ఆ సమయంలో భాస్కరరావు అతని కుటుంబ సభ్యులు పక్క గదిలో ఉన్నారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయమై భాస్కరరావు తనకు తగిన సాయం చేయాలని రెవెన్యూ అధికారులకు కలిసి విజ్ఞప్తి చేశారు.

ప్రమాదాలు జరగకుండా భారీగేట్ల ఏర్పాటు

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

పర్చూరు, అక్టోబరు 11: పర్చూరు బొమ్మల సెంటర్ కూడలిలోని డ్రైనేజ్ కాలువపై ఏర్పడి గుంత ప్రమాదాలకు నిలయంగా మారింది. గ్రామంలోని వెళ్లే ప్రధాన రహదారి మలుపుతో పాటు, ప్రధాన రహదారిలో గుంత ఉండటంతో తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈతరుణంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'రోడ్డు అంచున గుంత' అనే శీర్షిక కథనం ప్రచురితం అయిన నేపథ్యంలో పంచాయతీ అధికారులు స్పందించారు. యుద్ధప్రాతిపదికన గుంత చుట్టూ భారీగేట్లను ఏర్పాటు చేశారు.

కుందేరు ఒడ్డున చెత్త కుప్పల తొలగింపు

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


రామానాయుడు పార్కు కుందేరు మధ్య ఉన్న చెత్తను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

చీరాల, అక్టోబరు 11 : స్థానిక రామానాయుడు పార్కు, కుందేరు మధ్య ఉన్న ఖాళీ స్థలంలో చెత్త కువ్వలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆరోగ్యం కోసం వెళితే ... అనారోగ్యమే ! అన్న శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ ఆదేశాల మేరకు ఆ ప్రాంత పారిశుధ్య మేస్త్రి పర్యవేక్షణలో శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో అక్కడున్న చెత్త కువ్వలను తొలగించారు. వారం రోజుల్లో ఆ ప్రాంతంలో కంచె కూడా ఏర్పాటు చేస్తామని కమిషనర్ తెలిపారు. అందుకు ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు.











Printed and published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Private Limited., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey Nos : 206/2 206/3, Chirala Road, Throvagunta (Village), Ongole Rural (Mandal)-523262. Editor: K.Srinivas, Ph.Nos.246660, 246661,
RNI No. APTEL/2004/12966. Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N. Prasad